క్లుప్తంగా

ఆన్‌లైన్ నమోదు పరిశీలన



ఆన్‌లైన్ నమోదు పరిశీలిస్తున్న తహసీల్దార్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ప్రభుత్వం సమర్థవంతంగా చేపడుతున్న సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను ఆన్‌లైన్‌లో స్పష్టంగా నమోదు చేయాలని హాజీపూర్ తహసీల్దార్ శ్రీనివాసరావుదేశ్‌పాండే అన్నారు. హాజీపూర్ ఎంపీపీ కార్యాలయంలో చేపడుతున్న ఆన్‌లైన్ నమోదు ప్రక్రియను ఆదివారం పరిశీలించారు. సర్వేలో భాగంగా ఎన్యుమరేటర్లు సేకరించిన కుటుంబ సభ్యుల వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో ఎలాంటి పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని డాటాఎంట్రీ ఆపరేటర్లకు సూచించారు.

'ఎమ్మెల్యేను విమర్శించడం సరికాదు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

భీమిని: బెల్లంపల్లి ఎమ్మెల్యే వినోద్‌ను విమర్శించే స్థాయి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యకు లేదని బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింగరావు, మాజీ ఎంపీటీసీ దుర్గం ప్రభాకర్ అన్నారు. ఎమ్మెల్యేను విమర్శిస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో భీమిని, కన్నెపల్లి మండలాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, నాయకులు ప్రభాకర్, శ్రీహరిరావు, జలపతి, లక్ష్మణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

బెల్లంపల్లిరూరల్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. మండలంలోని ఆకెనపల్లిలో తోకల ప్రదీప్ జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన వాలీబాల్ టోర్నమెంట్ పోటీలను ఆదివారం చిన్నయ్య ప్రారంభించారు. ప్రదీప్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ క్రీడాకారులు క్రీడల్లో ఉన్నతంగా రాణించాలన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. క్రీడలు శారీరక, మానసిక ఉల్లాసానికి దోహదం చేస్తాయని తెలిపారు. ప్రదీప్ మృతి చాలా బాధాకారం అన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ సుభాష్ రావు, నాయకులు లక్ష్మణ్, రమేష్, గణేష్, రాజశేఖర్, విశాల్, ప్రదీప్ కుటుంబ సభ్యులు, యువకులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో విద్యార్థుల సత్తా



చాంపియన్ షిప్ కైవసం చేసుకున్న విద్యార్థులు

చెన్నూర్: మంచిర్యాలలో జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో చెన్నూర్ శార్వాణి పాఠశాల విద్యార్థులు సత్తాచాటి ఓవరల్ చాంపియన్ షిప్‌ను కైవసం చేసుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ మేడ శ్రావణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పోటీల్లో 30మంది విద్యార్థులు పాల్గొనగా 21మంది విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో గెలుపొందినట్లు పేర్కొన్నారు. ఇందులో ఏడుగురు బంగారు, 8మంది సిల్వర్, 6కాంస్య పతకాలు సాధించినట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలను పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీజన్, స్వామి, రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు కారెంగుల రామయ్య, మహేశ్ అభినందించారు.

సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ప్రారంభం



నియామకపత్రాలు అందజేస్తూ..

చెన్నూర్: భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రక్రియ ప్రారంభించినట్లు చెన్నూర్ పట్టణ సంస్థాగత ఎన్నికల సంయోజక్ పిట్టల రవి అన్నారు. స్థానిక బీజేపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ సంస్థగత ఎన్నికల ప్రక్రియలో భాగంగా బూత్ అధ్యక్షులను నియమించారు. రవి మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటాలన్నారు. ఇప్పటి నుంచే పార్టీ సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు బూత్ అధ్యక్షులను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ చెన్నూర్ పట్టణ ఇన్‌చార్జి పానుగంటి మధు, పట్టణ బీజేపీ అధ్యక్షులు జాడి తిరుపతి, నాయకులు కేవీఎం శ్రీనివాస్, కమ్మల శ్రీనివాస్, బత్తుల సమ్మయ్య, గర్రెపల్లి వెంకటనర్సయ్య, తుమ్మ శ్రీపాల్, శ్రావణి, రాజేశ్, చిరంజీవి, మానికరౌతు శంకర్, దుర్గ ప్రసాద్ పాల్గొన్నారు.

పాతదారిపై పట్టింపేది?



శివలింగాపూర్ గ్రామానికి వెళ్లే రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు



అక్కెపల్లి సమీపంలో వాగుపై కూలి పోయిన లోలెవల్ కాజ్‌వే

- అధ్వానంగా శివలింగాపూర్, అక్కెపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు
- గుంతలు పడినా మరమ్మతు కరువు

చెన్నూర్‌రూరల్: మండలంలోని శివలింగాపూర్, అక్కెపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డు దుస్థితి అధ్వానంగా ఉంది. గతంలో ఈ గ్రామాల గుండా కోటపల్లి మండలంలోని పారుపెల్లి, ఆలుగామ, జనగామ, ఎదులబందం, రొయ్యలపల్లి, సిర్స గ్రామాలకు వెళ్లేవారు. మహారాష్ట్రకు వెళ్లాలన్నా ప్రాణహిత నది వరకు వాహనాలు ఈ దారిగుండానే వెళ్లేవి. కానీ జాతీయ రహదారి ఏర్పాటుతో ఈ దారిని మరిచారు. రోడ్డుపై మొత్తం గుంతలు ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా, పట్టించుకునే వారే కరువయ్యారు. శివలింగాపూర్ గ్రామం నుంచి అక్కెపల్లి గ్రామానికి వెళ్లే రహదారిలోని వాగుపై లోలెవల్ కాజ్‌వే మొత్తం కూలిపోయింది. దీంతో పెద్ద వాహనాల రాకపోకలు సాగడం లేదు. జాతీయ రహదారి నిర్మించడంతో పాత రహదారిని పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రస్తుతం వాహనాల రాకపోకలు లేకపోవడంతో పాత రహదారి నిర్మానుష్యంగా మారింది. ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకొని రహదారిని బాగుచేయించి, వాగుపై వంతెన నిర్మించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

రోడ్డుపై గుంతలు పడ్డయ్..



శివలింగాపూర్, అక్కెపల్లి గ్రామాలకు వెళ్లే రోడ్డుపై గుంతలు ఏర్పడ్డాయి. ఏళ్లు గడుస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. గతంలో వాహనాలు ఇలానే నడిచేవి. కానీ ప్రస్తుతం ఈ దారిపై పట్టింపే లేదు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకొని రోడ్డును బాగుచేయాలి.

– సతీష్, శివలింగాపూర్

ఘనంగా సీఎస్ఐ చర్చి స్వర్ణోత్సవం



రిబ్బన్ కట్ చేస్తున్న రెవరెండ్ రూబెన్‌మార్క్

మందమర్రిరూరల్: పట్టణంలోని సెయింట్‌థామస్(సీఎస్ఐ) చర్చి స్వర్ణోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రెవరండ్ రూబెన్‌మార్క్(ఇన్‌చార్జి బిషప్ తండ్రి, మెదక్ డయాసిస్) ముఖ్య అతిథిగా హాజరై పునఃనిర్మించిన చర్చిని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మందమర్రి పట్టణంలో యాభై ఏళ్లుగా చర్చి కొనసాగడం అభినందనీయమన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. చర్చిపాస్టర్ భాస్కర్, జర్మియా ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రెవరెండ్ బి. విన్స్టన్, ఎం. జయానంద్, విమల్ సుకుమార్, ప్రభుకిరణ్, సాలోమొన్, ఎం.విల్సన్, వి.సామ్యేల్, బడికెల రవి, సంజీవయ్య, కిషోర్‌బాబు, కొండ రాజరత్నం, డీఈఆర్ పాల్, ప్రకాష్ జార్జ్ తదితరులు ఉన్నారు.

సులభ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న నాయకులు

రామకృష్ణాపూర్: సింగరేణిలో పనిచేస్తున్న సులభ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ అనుబంధ సులభ్‌వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానందం డిమాండ్ చేశారు. స్థానిక యూనియన్ కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. సులభ్ కార్మికులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్ బీమా, బోనస్ సౌకర్యం కల్పించాలన్నారు. కార్మికుల సమస్యలపై ఈ నెల 27న కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముట్టడి చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు నాగరాజు, నర్సయ్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

'మతోన్మాద శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలి'



మాట్లాడుతున్న శ్రీనివాస్

పాతమంచిర్యాల: మతోన్మాద విద్వేష శక్తుల నుంచి దేశాన్ని కాపాడుకోవాలని, శ్రామికుల ఐక్యతను బలోపేతం చేయాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మార్క్స్‌భవన్‌లో ఆదివారం వామపక్ష పార్టీల నాయకులు సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టీ.శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి లాల్‌కుమార్, సీపీఎం రాష్ట్ర నాయకులు పైళ్ల ఆశయ్య, సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి జాడి దేవరాజ్, చంద్రన్న వర్గం నాయకులు దేవయ్య పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రాణసంకటం..!



నెన్నెల: ప్రైవేట్ వాహనాల్లో పత్తి నింపేందుకు వెళ్తున్న కూలీలు, ట్రాక్టర్లలో పత్తి ఏరేందుకు వెళ్లే కూలీలు పత్తి ముళ్లెలపై, వాహనాల క్యాబిన్‌లపై ప్రమాదకర ప్రయాణాలు చేస్తున్నారు. ఇలాంటి ప్రమాదకర ప్రయాణాన్ని పోలీసులు అడ్డుకొని కౌన్సెలింగ్ ఇవ్వాలని పలువురు కోరుతున్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఓ బొలెరో వాహనంపై నిర్లక్ష్యంగా కూర్చొని వెళ్తున్న కూలీలు 'సాక్షి' కెమెరాకు చిక్కారు. పట్టుతప్పినా, బండి తూలినా, ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా ప్రాణాలకే ప్రమాదం పొంచి ఉంది.

నియామకం

జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంగాధర్



గంగాధర్

జన్నారం: నేతకాని సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిండెంట్‌గా తిమ్మాపూర్‌కు చెందిన జాడి గంగాధర్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు దుర్గం రాజేశ్ ఆదివారం నియామకంపత్రం అందజేశారు. జిల్లా కేంద్రంలో జరిగిన నేతకాని సంఘం ఆత్మగౌరవ సభలో నేతకాని మహార్ సమావేశంలో నియమించినట్లు తెలిపారు.

నియోజకవర్గ ఎస్సీ సెల్ చైర్మన్‌గా నరేశ్

కోటపల్లి: మండలంలోని బబ్బరుచెల్క గ్రామానికి చెందిన ఆసంపల్లి నరేశ్‌ను చెన్నూర్ నియోజకవర్గం ఎస్సీసెల్ చైర్మన్‌గా నియమిస్తూ టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మన్ నాగరిగారి ప్రీతం ఆదివారం హైదరాబాద్‌లో నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎస్సీసెల్ చైర్మన్ నరేశ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో నియోజకవర్గ బాధ్యతలు ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. దళితుల అభ్యున్నతికి పాటుపడతానని, పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తానని తెలిపారు.

తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శిగా కనకరాజు



కనకరాజు

కాసిపేట: కాసిపేట మండలం మద్దిమాడ గ్రామానికి చెందిన కనకరాజు తుడుందెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఎంపికైనట్లు ఆదివాసీ సంఘాల నాయకులు తెలిపారు. ఈనెల 20న ఉట్నూరులో నిర్వహించిన ఆదివాసీ హక్కుల పోరాట సమితి మహాసభల్లో జిల్లా ప్రధాన కార్యదర్శిగా కనకరాజును రాష్ట్ర కన్వీనర్ బుర్స పోశయ్య ప్రకటించారు. ఆదివాసీల సమస్యలు హక్కులపై పూర్తిస్థాయిలో పోరాటాలకు కృషి చేయాలన్నారు. ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొమ్ముల బాపు, రాయిసెంటర్ ఉప సర్మేడి కొమురం జనార్దన్, ఆదివాసీ నాయక్‌పోడ్ సేవాసంఘం మండల అధ్యక్షుడు బద్ది శ్రీనివాస్, నాయకులు రెడ్డి లక్ష్మణ్, తత్ర భీంరావు, ఆత్రం మహేశ్, మడావి వెంకటేశ్ తదితరులు కనకరాజును అభినందించారు.

మందమర్రి వాసికి అవార్డు



అవార్డు అందుకుంటున్న మట్టె రవీందర్

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణంలోని ప్రాణహిత కాలనీకి చెందిన మట్టె రవీందర్ అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వారు డాక్టర్ అబుల్ కలాం ఆజాద్ లెజెండరీ అవార్డుకు అందుకున్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఆదివారం నిర్వహించిన అబుల్ కలాం 93, సర్దార్ వల్లభాయ్ పటేల్ 149వ జయంతి వేడుకలు ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు డాక్టర్ సరోజనమ్మ, సినీ నటుడు నరేన్‌తేజ్, జ్యోతిస్వరూప్ తదితరుల చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్‌నగర్‌లో ఆదివారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు రాకేష్ రెడ్డి రోగులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. కంటి శస్త్ర చికిత్స అవసరమున్న వారిని గుర్తించి ఆపరేషన్‌ల కోసం డిసెంబర్ 12న గురువారం రేకుర్తి కంటి ఆస్పత్రికి పంపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు సుగుణాకర్ రెడ్డి, వార్డు కౌన్సిలర్ ప్రకాష్‌నాయక్, వార్డు అధ్యక్షుడు బెక్కం రాజారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

'వసతి గృహాలు సమస్యలకు నిలయాలు'

మంచిర్యాలఅర్బన్: సంక్షేమ వసతిగృహాలు సమస్యలకు నిలయాలుగా మారాయని ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాంప్రసాద్ అన్నారు. జిల్లా కేంద్రంలోని బీసీ వసతిగృహాన్ని ఆదివారం సందర్శించారు. మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచినా మెనూలో మార్పులు కనిపించటం లేదన్నారు. అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ వసతిగృహానికి పక్కా భవనం నిర్మించాలని డిమాండ్ చేశారు.

కార్తిక మాసం వన భోజనాలు

పాతమంచిర్యాల: కమ్మసేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఏసీసీ క్వారీలో కార్తిక మాసం వనభోజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమ్మ కుటుంబ సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు పంపిణీ చేశారు.

'గెలిపిస్తే సమస్యలు పరిష్కరిస్తా'

శ్రీరాంపూర్: రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తనకు మొదటి ప్రాధాన్యం ఓటేసి గెలిపిస్తే ఉద్యోగ, ఉపాధ్యాయ, నిరుద్యోగుల సమస్యలు పరిష్కరిస్తానని టీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ పోకల నాగయ్య తెలిపారు. నస్పూర్-శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఎన్నికల్లో డబ్బు ఉన్న నేతలు పోటీ చేస్తున్నారని, అలాంటి వారు ప్రజలకు ఏమాత్రం సేవ చేయలేరన్నారు. సామాన్యుడైన తనకు అవకాశం ఇచ్చి గెలిపిస్తే, ఎళ్లవేళలా అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రావుల రాజేశ్‌యాదవ్, టీఎల్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాపెల్లి రాజన్న, నాయకులు పాదం శ్రీనివాస్ పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

భీమిని: కన్నెపల్లి, భీమిని మండలాల్లోని జన్కాపూర్, వీగాం, కన్నెపల్లి వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆదివారం వ్యవసాయాధికారులు, కాంగ్రెస్ నాయకులు ప్రారంభించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నర్సింగరావు, మండల వ్యవసాయాధికారి సాయి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో సంబురాలు

భీమిని: మహారాష్ట్రలో బీజేపీ అత్యంత భారీ మెజార్టీతో విజయం సాధించడంతో ఆదివారం కన్నెపల్లిలో బీజేపీ నాయకులు సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, మండల అధ్యక్షుడు రామయ్యయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

'చలో హైదరాబాద్' విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: ఈ నెల 26న హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద చేయూత పెన్షన్‌దారుల హక్కుల సాధన కోసం దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి జాతీయ కోర్ కమిటీ కో చైర్మన్ పెద్దపల్లి సత్యనారాయణ పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

శ్రీరాంపూర్: సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 6 కొత్త రోడ్‌లో ఆదివారం శ్రీరాంపూర్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసులకు సహకరించాలన్నారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగాయని, వీటిపై అవగాహనతోనే బయటపడవచ్చన్నారు. యువత, విద్యార్థులు గంజాయి బారిన పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గంజాయి అమ్మినా, సేవించినా చర్యలు ఉంటాయన్నారు . చట్ట వ్యతిరేక చర్యలకు ఎవరు పాల్పడ్డా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రజలు డయల్ 100ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించి వాహనాలు నడుపాలన్నారు. హెల్మెట్ లేకుండా, మద్యం సేవించి బైక్‌లు నడిపితే చర్యలుంటాయన్నారు. కాలనీలో దొంగతనాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా గంజాయి అనుమానితుల ఇళ్లు, వాడల్లో డాగ్‌స్వాడ్‌తో తనిఖీలు చేయించారు. అనంతరం వాహనాలను తనిఖీ చేశారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేని 40బైక్‌లు, 5 ఆటోలు సీజ్ చేశారు. కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణు చందర్, ఎస్సైలు సంతోశ్, శ్రీధర్, లక్ష్మీ, ప్రసన్న పాల్గొన్నారు.

'మాలల సింహగర్జన' పోస్టర్ ఆవిష్కరణ



శ్రీరాంపూర్: పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

చెన్నూర్: మాలల హక్కుల పరిరక్షణే లక్ష్యంగా డిసెంబర్ 1న హైదరాబాద్‌లో తలపెట్టిన మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని మాల ఉద్యోగుల జేఏసీ జిల్లా కన్వీనర్ తొగరు సుధాకర్ అన్నారు. స్థానిక అంబేద్కర్ చౌక్‌లో ఆదివారం సింహగర్జన పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కో కన్వీనర్లు కుంబాల రాజేశ్, గజ్జెల్లి లక్ష్మణ్, దాసరి వెంకటరమణ, కౌన్సిలర్ రెవెల్లి మహేశ్, రవికుమార్, సుధీర్, కాపురపు నవీన్, మల్లన్న, కనకరాజు, మధుకర్, రమేశ్, శంకర్ పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: వచ్చే నెల 1న హైదరాబాద్‌లో జరిగే మాలల సింహగర్జన పోస్టర్లను మాల సంక్షేమ సంఘం నాయకులు ఆవిష్కరించారు. నస్పూర్ కాలనీలోని సంఘం కార్యాలయంలో ఆదివారం మాల కుల సంఘాల జేఏసీ కన్వీనర్ తొగరు సుధాకర్ ఆవిష్కరించారు. సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో జరిగే ఈ సభకు పెద్దఎత్తున మాలలు తరలిరావాలన్నారు. మాలలు ఐక్యంగా ఉండి తమ సత్తా చాటుకోవాలన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు పాల్గొన్నారు.

'బీసీ మహాసభ' విజయవంతం చేయండి



ఐక్యత చాటుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 29న నిర్వహించే మహాసభను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ నీలకంఠేశ్వర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని చార్వాక ట్రస్టు భవన్‌లో నాయకులతో సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. బీసీలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం, కులగణనపై చర్చ కోసం సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ హాజరవుతున్నట్లు, ఈ సభకు జిల్లాలోని బీసీలు అధిక సంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్, జిల్లా యువజన అధ్యక్షుడు రాంశెట్టి నరేందర్, జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్, ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కొమురయ్య, స్వర్ణకార సంఘం నాయకులు ముత్తోజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయిబాబా జయంతి



నృత్యం చేస్తున్న చిన్నారులు

నెన్నెల: మండల కేంద్రంలోని గంగాధర దేవాలయ ఆవరణలో సత్యసాయిబాబా జయంతి వేడుకలను సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఉదయం 6గంటలకు నగర సంకీర్తనతో ప్రత్యేక పూజలు ప్రారంభమయ్యాయి. సత్యసాయిబాబా భారీ చిత్రపటాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తిగీతాలు ఆలపించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మహా అన్నదాన కార్యక్రమం చేపట్టారు. చిన్నారుల నృత్యం ఆహుతులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వేద పండితులు రిటైర్డ్ హెచ్‌ఎం రాంమూర్తి మాట్లాడారు. సత్యసాయి దేశానికే ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు చిలువేరు సుదర్శన్, డి.రాజన్న, చిలువేరు రమేష్, సత్యనారాయణ, గోపతి సంతోష్, కాసనగొట్టు వెంకటేషం, కాచం పురుషోత్తం పాల్గొన్నారు.

అసంపూర్తిగా పాఠశాల భవనం



భీమారం: మండలంలోని రెడ్డిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పనులు రెండేళ్లైనా పూర్తికాలేదు. గతంలో ఉన్న పాఠశాల భవనం శిథిలావస్థకు చేరడంతో దానిని కూల్చి వేశారు. దాని స్థానంలో కొత్త భవనం నిర్మించేందుకు ప్రభుత్వం రూ.5లక్షలు మంజూరు చేసింది. ఈ మేరకు భవనం నిర్మాణానికి ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు నిర్మాణ పనుల బాధ్యత అప్పగించింది. గోడల వరకు పనులు చేసి ఆ కాంట్రాక్టర్ అర్ధంతరంగా నిలిపివేశారు. దీంతో ప్రస్తుతం పాఠశాలను అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్నారు. అక్కడ సరైన వసతులు లేక విద్యార్థులు నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా చర్యలు తీసుకొని, వెంటనే పాఠశాల భవనాన్ని పూర్తి చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

యువతకు సన్మానం



సన్మానిస్తున్న గ్రామ పెద్దలు

జన్నారం: మండలంలో హాస్టల్ తాండా గిరిజన గ్రామంలో ఇటీవల పలువురు ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన యువకులను గ్రామ పెద్దలు సన్మానించారు. సింగరేణి ఉద్యోగం సాధించిన శ్రీనివాస్, పోలీసు కానిస్టేబుల్‌గా ఎంపికైన తేజావత్ సోని, రెవెన్యూ డిపార్టుమెంట్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా ఎంపికైన లకావత్ రాజుతో పాటు మరో ముగ్గురు ఎంసెట్‌లో ఎంపికైనట్లు గ్రామస్తులు తెలిపారు. వీరిని మాజీ సర్పంచ్ జయశ్రీ, అడ్వకేట్ సంతోష్, గ్రామ పెద్దలు బాలాజీ, శ్రీనివాస్, అంబాజీ రాకేశ్, అమర్‌సింగ్ సన్మానించారు.